సాక్షి
పెద్దపల్లి

బుధవారం, 4, అక్టోబర్, 2023



అయ్యప్ప గుడిలో అభిషేకాలు

యైటింక్లయిన్‌కాలనీ: సంకష్టహర చతుర్థి సందర్భంగా స్థానిక శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేశారు.



ఉపాధ్యాయుల నిరసన

ఎలిగేడు: 5శాతం మధ్యంతర భృతిని నిరసిస్తూ సుల్తాన్‌పూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దాసరి ఉష



దాసరి ఉష

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే ఎమ్మెల్యే అభ్యర్థుల తొలిజాబితాను బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం 20మందితో కూడిన ఫస్ట్ లిస్ట్‌ను బీఎస్పీ నేషనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ ప్రకటించారు. అందులో పెద్దపల్లి(జనరల్) నుంచి పద్మశాలీ సామాజికవర్గానికి చెందిన దాసరి ఉషకు మొదటి జాబితాలోనే చోటుదక్కింది. దాసరి ఉష గత కొన్నేళ్లుగా 'పద్మహన్మయ్య ఫౌండేషన్' తరపున ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించడం, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పెద్దపల్లి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి 'మన ఊరు మన ఊష' పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున దాసరి మనోహర్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారుకాగా, తాజాగా బీఎస్పీ నుంచి దాసరి ఉష బరిలో నిలవనున్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాల కోసం దరఖాస్తులు స్వీకరించినా.. ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 4న ఉదయం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి శ్రీధర్ మంగళవారం తెలిపారు. కొత్త సర్టిఫికెట్లు, తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్నవారు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్ తర్వాత వైద్యశిబిరాలకు వచ్చేవారు రసీదుతోపాటు వైకల్యం పరీక్ష కాపీ, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్ వెంట తీసుకు రావాలని సూచించారు.

అభ్యంతరాలు తెలపండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారంలోగా తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలపాలని డీఈవో మాధవి సూచించారు. తగిన ఆధారాలతో డీఈవో కార్యాలయంలో అప్పగించాలన్నారు. స్పౌజ్ పాయింట్స్ తుది జాబితాను ఈనెల 5 వరకు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

హామీలు నిలబెట్టుకుంటాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం స్థానిక 6వ డివిజన్ పవర్‌హౌస్‌కాలనీలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే.. గడిచిన తొమ్మిదేళ్ల నుంచి రాష్ట్రం, రామగుండాన్ని బీఆర్‌ఎస్ పాలన పూర్తిగా అవినీతిగా మార్చారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని ఆయన తెలిపారు. దీంతోనే కాంగ్రెస్‌లో చేరేందుకు చాలామంది ముందుకు వస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికలలో రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురేయాలని కోరారు. కాగా, పార్టీలో అంతగిరి అనిల్, మిడిదొడ్డి శ్రీనివాస్, బాబు, నాగరాజు తదితరులు చేరగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, పెండ్యాల మహేశ్, కొటం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్



బహుమతి అందిస్తున్న డీవైఎస్‌వో సురేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లు అని పెద్దపల్లి డీవైఎస్‌వో సురేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐపీఎస్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ జోనల్ కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతి ప్రదానం చేశారు. 4 మండలాల నుంచి 350 మంది క్రీడాకారులకు భోజన వసతులు కల్పించిన ఇండియన్ పబ్లిక్ పాఠశాల యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, బుచ్చిరెడ్డి, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధూకర్, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ, ఇక్బాల్, సంపత్ పాల్గొన్నారు.

'కోడ్'కు ముందే స్పీడ్!

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బీఆర్‌ఎస్ దూకుడు
- అవే వేదికలపై తమనే గెలిపించాలని ప్రచారం
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ
- నాలుగు సీట్లకు బీఎస్పీ అభ్యర్థుల ప్రకటన
- క్యాంపు కార్యాలయాల ఖాళీకి ఎమ్మెల్యేలు సిద్ధం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో ఎన్నికల వేడి పెరిగింది. ఎన్నికల సంఘం పర్యటన మొదలైన దరిమిలా అధికార పార్టీ కూడా అభివృద్ధి పనుల శంకుస్థాపనల స్పీడ్ పెంచింది. అవే వేదికలపై ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించింది. తమను మరోసారి గెలిపిస్తే.. ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తామంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ వస్తే.. రాష్ట్రం అధోగతి పాలవుతుందని మాటలదాడి చేస్తున్నారు. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలంతా అభివృద్ధి పనుల స్పీడ్ పెంచారు. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల పనులు, పెండింగ్ పనులు పూర్తిచేయడం, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, దళితబంధు జాబితా ఎంపిక, పింఛన్లు పంపిణీ, రోడ్లు, మున్సిపల్ వర్క్స్ తదితరాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల వేగం పెంచారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏదిచేసినా ఈనెల 6– నుంచి 14 తేదీలోగా పూర్తిచేయాలన్న పార్టీ అధిష్టానం సూచనలతో పెండింగ్ పనులన్నీ పూర్తిచేసే పనిలో ఉన్నారు. 60 ఏళ్లలో పాత జిల్లాలో జరిగిన అభివృద్ధి, గతపదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తాము దేశంలో ముందున్నామని వివరిస్తున్నారు. 13 నియోజకవర్గాల్లో రోజూ చేరికల పర్వంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెద్దపల్లి, జగిత్యాల, రామగుండం, ధర్మపురిలో అభివృద్ధి పనులను ప్రారంభించి ఎన్నికల సమరశంఖం పూరించారు. మినీ బహిరంగసభలతో ప్రధాన ప్రత్యర్థులు కాంగ్రెస్, బీజేపీపై విమర్శలతో విరుచుకుపడుతున్నారు.

ఎమ్మెల్యేల ప్రైవేట్ కార్యాలయాలు సిద్ధం

ఎన్నికలకు ముందస్తు వ్యూహంతో వచ్చిన భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) ముందే అభ్యర్థులను ప్రకటించింది. వాస్తవానికి మరునాటి నుంచే అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మధ్యలో జమిలి ఎన్నికల ప్రస్తావనతో కాస్త విరామం ప్రకటించారు. ఇటీవల జమిలి లేదని తేలడంతో తిరిగి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వేదికలపై నుంచి తమ అభివృద్ధి వివరిస్తూనే.. ప్రత్యర్థులపై విమర్శలతో విరుచుకుపడుతున్నారు. త్వరలోనే ఎన్నికల షెడ్యూలు విడుదలవనున్న నేపథ్యంలో క్యాంపు కార్యాలయాలను ఖాళీ చేసేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఇప్పటికే అందరికీ అందుబాటులో ఉండేలా వారంతా ప్రైవేట్ కార్యాలయాలను కిరాయికి తీసుకోవడం విశేషం. మరోవైపు.. సోషల్ మీడియాను కూడా బలోపేతం చేసుకుంటున్నారు. ప్రతీ గ్రామంలో సోషల్ మీడియా ఆర్మీలను నియమించుకుంటున్నారు. పర్వదినాలు, పండుగలు, పరామర్శలు.. ఇలా సందర్భమేదైనా ముందుంటున్నారు.

కాంగ్రెస్, బీజేపీలో రాని స్పష్టత..

ఉమ్మడి జిల్లా నుంచి 13 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నుంచి 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు అదేసంఖ్యలో బీజేపీ నుంచి అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇంతవరకూ రెండుపార్టీలు ఒక్కఅభ్యర్థిని కూడా అధికారికంగా ప్రకటించలేదు. పాత కరీంనగర్ జిల్లాలో ఒకట్రెండుచోట్ల మినహా అన్నిస్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారన్న ప్రచారం ఉన్నా.. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. బీజేపీ అభ్యర్థుల విషయంలో ఇదేరకమైన అనిశ్చితి నెలకొంది. దీన్నిఅవకాశంగా తీసుకున్న బీఆర్‌ఎస్.. మరింత దూకుడు పెంచుతోంది. 11మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రోజూ సుడిగాలి పర్యటనలు చేస్తూ అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

బీఎస్పీ జాబితా విడుదల..

ఉమ్మడి జిల్లాలో బీఎస్పీ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో మూడు ఎస్సీ స్థానాలు, ఒకటి జనరల్ కావడం విశేషం. నిశాని రామచందర్ –మానకొండూరు, చొప్పదండి– కొంకటి శేఖర్, ధర్మపురి– నక్కా విజయ్‌కుమార్, పెద్దపల్లి–దాసరి ఉష పేర్లు ఖరారు చేసింది. ఇందులో అభ్యర్థులంతా ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. తెలంగాణలో 32 స్థానాల్లో పోటీచేస్తామని తాజాగా ప్రకటించిన జనసేన పార్టీ పాత కరీంనగర్ జిల్లాలో నాలుగు స్థానాలపై కన్నేసింది. రామగుండం, హుస్నాబాద్, జగిత్యాల, మంథని స్థానాల నుంచి తమ అభ్యర్థులు బరిలోకి దిగుతారని ప్రకటించడం గమనార్హం.

సమస్యలకు సత్వర పరిష్కారం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నగర మేయర్ అనిల్‌కుమార్

- రామగుండం ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ చొరవతో, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో రామగుండం కార్పొరేషన్ డివిజన్ల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం 48, 49 డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చందర్ మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రతీడివిజన్‌కు అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎక్కడ చిన్నసమస్య ఎదురైనా సత్వరమే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మహిళలు మంచినీటి కోసం బిందెలతో రోడ్లపైకి వచ్చి పోరాటం చేసేవారని, నేడు ఆ పరిస్థితులు లేవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ పొన్నం దివ్య, లక్ష్మణ్, బాల రాజ్‌కుమార్, నాయకులు వంగ శ్రీనివాస్, గౌస్, రఫీక్, తానిపర్తి గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఎవరు ఎవరిని గెలిపించారో తేల్చుకుందాం

ఎవరు ఎవరిని గెలిపించారో తేల్చుకుందామని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సవాల్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. ప్రచారం చేయడం కోసం ఎమ్మెల్యే వద్ద పైసలు తీసుకున్నారని వారు ఆరోపించారు. ఎమ్మెల్యేలను విమర్శించడం ఆమెకు ఆనవాయితీ అని విమర్శించారు. గతంలోనూ అప్పటి ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ తన కాలిగోటికి సరిపోరని అనుచిత వ్యాఖ్యలు చేశారని వారు గుర్తుచేశారు. ఎమ్మెల్యే చందర్ ఆదేశాల మేరకు సంధ్యారాణిని జెడ్పీటీసీగా గెలిపించడం కోసం తాము 18గంటలు పనిచేశామని, ఆమె తరఫున ప్రచారం చేశామన్నారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌కు అసెంబ్లీ టికెట్ కేటాయించిన క్రమంలో అతనితో రాజీనామా చేయించి, కందుల సంధ్యారాణిని చైర్ పర్సన్ చేస్తామని రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్వయంగా చెప్పినా ఖాతరు చేయలేదని పేర్కొన్నారు. కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవితాసరోజిని, జంజర్ల మౌనిక, కలువల శిరీష, జంగపల్లి సరోజన, గాదం విజయ, బాదె అంజలిదేవి, కోఆప్షన్‌సభ్యులు తానిపర్తి విజయలక్ష్మి, తస్నీంబాను, నాయకులు అనుముల కళావతి, ముద్దసాని సంధ్యారెడ్డి, గుంపుల లక్ష్మి, రమ్యయాదవ్ ఉన్నారు.

రేపు బల్దియా సమావేశం

కోల్‌సిటీ:రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈనెల 5న కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 15 అంశాలతో ఎజెండా రూపొందించారు. 8 గ్రామ పంచాయతీల విలీనంతో ఏర్పడిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు జనగామ అని నామకరణం చేయాలని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఆ అంశాన్ని కూడా ఎంజెడాలో చేర్చారు. అలాగే 50 డివిజన్లలోని బల్దియా స్థలాలను లీజుకు ఇవ్వాలని, విధుల్లో లేని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అధికారి పేరిట అద్దెకు వాహనం నడిపించడం తదితర అంశాలను పొందుపరిచారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులకు ఎజెండా కాపీలు పంపించారు.

మోసపోతే.. గోసపడ్తం



మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకు నాగలి బహూకరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- కొనసాగుతున్న ప్రజాఆశీర్వాద పాదయాత్ర

రామగిరి: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటు వేస్తే మోసపోతామని, మోసపోతే మళ్లీ గోస పడుతామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంగళవారం రామయ్యపల్లి, రాజాపూర్, ఆదివారంపేట, లద్నాపూర్, నాగెపల్లి, రత్నాపూర్, సెంటనరీకాలనీల్లో తొమ్మిదోరోజు ప్రజాఆశీర్వాద పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీలేదని, దాని కపట నాటకాలను తెలియజేస్తూ, బడుగు, బలహీన వర్గాలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా యాత్ర చేపట్టామన్నారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. సింగరేణి నిర్వాసిత గ్రామాలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, జెడ్పీటీసీ మ్యాదరబొయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబొయిన శ్రీదేవి, టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప అస్వస్థత

నాగెపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పుట్ట మధు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి ప్రాథమిక చికిత్స అందించగా ఆయన పాదయాత్ర కొనసాగించారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

మంథని: తమ కోసం ఆరాటపడేవాళ్లను ప్రజలు గుర్తించాలని, అలాగే ఓట్ల కోసమే వచ్చే వారికి గుణపాఠం చెప్పేలా చైతన్యం రావాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గంగాపురి నుంచి రామగిరి మండలం సెంటనరీకాలనీ వరకు ప్రజాఆశీర్వాద యాత్ర కొనసాగింది. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి కూచిరాజ్‌పల్లి, పుట్టపాక, అక్కెపల్లి మీదుగా రామగిరి మండలం రామయ్యపల్లి, రాజాపూర్, లద్నాపూర్, ఆదివారంపేట, నాగేపల్లి, రత్నాపూర్, పన్నూర్‌కు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు.

కన్నీళ్లు తప్ప మిగిలిందేమీ లేదు

- జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి



రాజీనామా పత్రం చూపెడుతున్న సంధ్యారాణి

గోదావరిఖని: అవమానాలు, కన్నీళ్లు, బాధలు, అణచివేతలు తప్ప బీఆర్‌ఎస్ పార్టీలో తనకు మిగిలిందేమీ లేదని పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపిస్తానని ఆమె పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఎంత అభివృద్ధి చెందింది, ఎంత వెనుకకు పోయామో గమనించాలని కోరారు. తన గెలుపుతోనే ఈ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మేధావులు, విద్యార్థులు, యువకులు రాజకీయాల్లోకి రావడానికి బయపడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం దోచుకో, దాచుకో, కొనుక్కో పద్ధతి కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో ముందుకు వస్తే.. అణగదొక్కాలని చూస్తున్నారని ఆవేదన చెందారు. మహిళలను కించపరిచేలా రాజకీయాలు ఉన్నాయని కందుల సంధ్యారాణి చెప్పారు. కొంగు చాచి అడుగుతున్నానని, తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు.

గోదారి.. విషతుల్యం



గోదావరి నదిలో తేలియాడుతున్న నురగ



నీటి శాంపిళ్లు సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ బోర్డు సిబ్బంది

- నదీజలాల్లోకి కాలుష్య కారకాలు
- నురగలు కక్కుతున్న గోదావరి నీళ్లు
- కాచిచల్లార్చితేతప్ప పనికిరావంటున్న వైద్యులు
- దృష్టి సారించని సంబంధిత అధికార యంత్రాంగం
- పుణ్యస్నానాలు చేసేందుకు వెనుకాడుతున్న భక్తులు
- ప్రాభవం కోల్పోతున్న నదీమతల్లి

గోదావరిఖని: పవిత్ర గోదావరి నదీజలాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకున్నాయి. రసాయనాలను నేరుగా నదిలోకి విడుదల చేయడంతో నీళ్లు గరళంగా మారుతున్నాయి. వివిధ అవసరాల కోసం గోదావరి నీళ్లు వినియోగించే నగరవాసులే కాదు.. నదీతీర గ్రామాలు, సింగరేణి కార్మిక కుటుంబాలు ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నాయని వైద్యులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంచనాలు తలకిందులు..

- గోదావరి నది గలగల పారుతూఉంటే కోనసీమను తలపిస్తుందని ఈప్రాంత వాసులు ఆశపడ్డారు.
- ప్రస్తుతం వారిఆశలు, అంచనాలు తలకిందులవుతున్నాయి.
- సుందిళ్ల(పార్వతీ)బ్యారేజీతో సుమారు ఏడుకిలోమీటర్ల మేర గోదావరి నదికి జలకళ సంతరించుకుంది.
- ఏడాది పొడవునా నీటినిల్వలు ఉంటున్నాయి. తద్వారా సమీప ప్రాంతాల్లో నీటి మట్టం బాగా వృద్ధి చెందుతోంది.
- కానీ తీరం వెంట ఉన్న పరిశ్రమలు, పట్టణాల నుంచి వెలువడే కాలుష్య కారకాలు నేరుగా గోదావరినదిలో కలుస్తున్నాయి.
- రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రోజూ వందల మిలియన్ లీటర్ల వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి.
- ఈ నీరు తాగడానికి కాదుకదా.. స్నానాలు చేయడానికి కూడా అనుకూలంగా లేదని పారిశ్రామికప్రాంత వాసులు వాపోతున్నారు.
- ఇతర ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే విషతుల్యాలు నేరుగా నదిలో కలవడంతో నీళ్లపై నురగలాంటి తెట్టు ప్రత్యక్షమవుతోంది.
- ఆ నీటితో స్నానం చేస్తే వంటిపై దురద, బొబ్బలు వస్తున్నాయని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కలుషిత నీటిని తాగడంతో కాలేయం దెబ్బతిని వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలైయ్యేవారి సంఖ్య కూడా పెరుగుతోంది.

ఇంకెన్నాళ్లు విషతుల్యాలు?

వాస్తవానికి కార్పొరేషన్‌లో విడుదలయ్యే వ్యర్థాలను సీవరేజ్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి.. ఆ తర్వాతనే మంచినీటిని నదిలోకి వదలాలి. సీవరేజ్ ప్లాంట్ శిథిలం కావడంతో మురుగు, కాలుష్య కారక నీళ్లు శుద్ధి కావడంలేదు. దీనికితోడు నదీతీరంలోనే డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. ఇటీవల వచ్చిన వరదలు, బ్యాక్‌వాటర్‌తో డంప్ నీట మునిగింది. చెత్త, చెదారం నదిలో కలిసిపోయాయి. ఒకవైపు కాలుష్యం, మరోవైపు వ్యర్థాలు, చెత్తడంపింగ్ యార్డుతో గోదావరి నీళ్లు కంపు కొడుతున్నాయి.

నోటీస్‌లు ఇచ్చినా పట్టించుకోలే



గోదావరి నదిలో నురగనీటి ప్రవాహం కొనసాగుతోంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఇప్పటికే అనేకసార్లు ఫిర్యాదు చేశాం. పరిశ్రమలకు నోటీసులు పంపించినా పట్టించుకోవడం లేదు. ఆర్ఎఫ్‌సీఎల్ పైప్‌లైన్ ద్వారా రసాయనాలు నేరుగా నది నీటిలో కలుస్తున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు. – మద్దెల దినేశ్, అధ్యక్షుడు, బెటర్ ఫర్ సొసైటీ

జాండిస్ కేసులు పెరుగుతున్నాయి



నగరవాసుల్లో కొద్దికాలంగా జాండిస్ కేసులు పెరుగుతున్నాయి. కలుషితనీరు తాగడం ద్వారా లివర్ సమస్య ఏర్పడుతోంది. వాంతులు, విరేచనాలు, కడుపులో నొప్పి తదితర సమస్యలు తలెత్తుతున్నాయి. నీటిని నేరుగా కాకుండా కాచి చల్లార్చిన తర్వాతే వినియోగించాలి. తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. – రాజశేఖర్‌రెడ్డి, ఎంబీబీఎస్, ఎండీ, జనరల్

శాంపిళ్లు సేకరించాం



కాలుష్య కారక ఆనవాళ్లు, పరిశ్రమల నుంచి గోదావరినదిలోకి వచ్చి చేరే నీటి శాంపిళ్లను మ ంగళవారం సేకరించాం. ఇంకా కొన్ని సేకరించా ల్సి ఉంది. ఈ నమూనా లను వరంగల్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నాం. రెండేళ్ల క్రితం ఇదే పరిస్థితి తలెత్తింది. కా లుష్య కారక పరిశ్రమలు, సంస్థలను ఉపేక్షించేది లేదు. – భిక్షపతి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి

క్లుప్తంగా

అనాథలకు దుస్తులు పంపిణీ



దుస్తువులు అందిస్తున్న కలువల సంజీవ్

గోదావరిఖనిటౌన్: స్థానిక స్థానిక ఎండీహెచ్ డబ్ల్యూ బాలల సంరక్షణ కేంద్రంలోని అనాథ బాలబాలికలకు బీఆర్ఎస్ నాయకుడు కలువల సంజీవ్ దుస్తులు పంపిణీ చేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా తొలుత వేడుకలు నిర్వహించిన పలువురు నాయకులు.. కేక్‌కట్‌చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. పిల్లలకు దుస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఎరుకల రాజయ్య, రాజకిశోర్, మారం మహేశ్, గసికంటి సరేందర్, నడివెడ్డి వెంకటేశ్, యాకూబ్ పాషా, మెంతుల ప్రదీప్, గోవర్ధనశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కుందనపల్లి రైల్వేవంతెన నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

రామగుండం: రామగుండం–రాఘవపూర్ మధ్య కుందనపల్లి రైల్వేగేట్(ఎల్‌సీ–49) వద్ద రైల్వేవంతెన నిర్మించాలని రైల్వే ప్రజాసంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ కోరారు. ఈమేరకు సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ డివిజనల్ ఇంజనీర్(కో ఆర్డినేషన్) కృష్ణారెడ్డికి మంగళవారం లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ప్రతీగంటలో 45 నిమిషాలు గేటువేసి ఉండడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. ఇదేవిషయంపై పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ సైతం రైల్వే డీఈఎన్‌కు ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రత వివరించారు. స్పందించిన డీఈఎన్.. రూ.65 కోట్ల వ్యయంతో వంతెన టెండర్లు పూర్తయ్యాయన్నారు. రెండు మాసాల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని శ్రీనివాస్ తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు

మంథని: నీటి వనరుల్లో ఈత సరదా అనేక మంది ప్రాణాలు బలి తీసుకుంటోంది. ప్రాణాపాయం అని తెలిసినా కొందరు సరదా వీడడంలేదు. మంగళవారం రాత్రి పట్టణ శివారు బన్నెచెరువులో సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు గల్లంతయ్యాడు. మరొకరు సురక్షితంగా ఒడ్డుకు చేరాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి బోయిన్‌పేటకు చెందిన ఆకుల భవాని శంకర్(23), మరో యువకుడు అక్షయ్ స్నానం కోసమని బన్నె చెరువులోకి వెళ్లారు. కట్టకు ఒకవైపు నుంచి మరోవైపు వరకు ఈతకొడుతూ చేరాలనుకున్నారు. ఈ క్రమంలో అక్షయ్ సురక్షితంగా ఒడ్డుకు చేరగా భవాని శంకర్ మధ్యలోనే శ్వాస సమస్య రావడంతో ముందుకు సాగలేకపోయాడు. గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం పడవల సాయంతో గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికుల ప్రాణాలకు భరోసా ఏది?

- సిమ్స్‌లో కాంట్రాక్టు కార్మికుడి దుర్మరణం
- ఏడోఅంతస్తు భవనంపై నుంచి కిందపడి మృతి
- భవన నిర్మాణం పనులు చేస్తుండగా ఘటన
- ఈ ఏడాదిలో ఇది రెండో సంఘటన
- రక్షణ చర్యలు లేకనే ప్రమాదాలని ఆరోపణలు



మృతి చెందిన రామ్‌మిలన్ యాదవ్ కార్మికుడు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో మంగళవారం రామ్‌మిలన్ యాదవ్(37)అనే కాంట్రాక్టు కార్మికుడు భవనం పైనుంచి పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం .. కాలేజీ ఆవరణలోని ఏడో అంతస్తు భవనం నిర్మిస్తున్నారు. ఇనుపప్లేట్‌తో సెంట్రింగ్ పనులు చేస్తుండగా రామ్‌మిలన్ యాదవ్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కు తరలించారు. మార్గమధ్యంలోనే కార్మికుడు మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు సంఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించారు. తోటి కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని స్వస్థలానికి తరలించారు.

వరుస ప్రమాదాలతో కార్మికుల్లో భయం..

- సిమ్స్‌లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు.
- కాంట్రాక్టర్లు, పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దాలు హన్సా అనే కాంట్రాక్టు కార్మికుడు బైడింగ్ వర్క్ చేస్తూ ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడు.
- ఇదే తరహాలో మంగళవారం కూడా రామ్‌మిలన్ యాదవ్ మృతి చెందడంతో విషాద ఛాయలు అలముకున్నాయి.
- బిల్డింగ్‌లపై పనిచేస్తున్న కార్మికులను సేఫ్టీ బెల్టులు పెట్టుకోకుండా పని చేయించడంతోనే మృతి చెందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంమే..

సిమ్స్ భవన నిర్మాణం పనుల్లో అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదని, తద్వారా కాంట్రాక్టు కార్మికులు మృతి చెందుతున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఆరోపించారు. భవనం ఏడో అంతస్తుపై నుంచి పడి మధ్యప్రదేశ్‌కు చెందిన రామ్‌మిలన్ యాదవ్ మృతి చెందడం బాధాకరమన్నారు. భవనంపై రక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేని ప్రశ్నించారు. గతంలో కూడా ఒకకార్మికుడు ఇదే తరహాలో మృతి చెందాడని, మరొకరు తీవ్రంగా గాయపడ్డారని గుర్తుచేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ప్రభుత్వ కార్యదర్శి, డీఎంఈ, కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినట్లు ఆయన తెలిపారు. పనులను పర్యవేక్షించే ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తోపాటు కాలేజీ అధికారులపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పౌర సరఫరాల గోదాములో విజిలెన్స్ విచారణ

- 840 బస్తాల బియ్యం మాయం



తనిఖీలు చేస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్:జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల గోదాములో 840 బస్తాల బియ్యం మాయమైనట్లు విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో తేలింది. హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు ప్రభాకర్‌తోపాటు జంగయ్య, కృష్ణ మంగళవారం గోదాములో తనిఖీలు చేశారు. రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా చేసే గోదాములో అక్రమాలు జరిగాయంటూ అందిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. రికార్డుల్లో ఉండాల్సిన నిల్వల కన్నా 840 బస్తాల బియ్యం తక్కువగా ఉన్నట్లు తేలిందని సివిల్‌సప్లై ఓఎస్‌డీ ప్రభాకర్ తెలిపారు. ఇందులో పాఠశాలలకు పంపాల్సిన సన్నరకం బియ్యం 741 బస్తాలతోపాటు వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న 99బస్తాల బియ్యం తేడా వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మారం: స్థానిక ఆదర్శ విద్యాలయంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతి భ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ మన్నె దీనా మంగళవారం తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రావ్య, ప్రదీప్తి పతకాలు సాధించారన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. పీఈటీ రాజేశం, మునీదర్ ఎస్.మణికుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు బైకాని కొమురయ్య పాల్గొన్నారు.

అత్తారింటికి వచ్చి.. బావిలో శవమై

- యువకుడి అనుమానాస్పద మృతి
- 20 రోజుల క్రితమే మిస్సింగ్
- మొండెం లేకుండా నీళ్లలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం



వ్యవసాయ బావిలో మృతదేహం



గణేశ్ (ఫైల్)

చొప్పదండి: అత్తారింటికి వచ్చిన ఓ యువకుడు ఆ ఊరి పొలిమేర్లలో శవమై కనిపించిన ఘటన చొప్పదండి మండలంలోని రెవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో తల లేని మొండెంతో ఉన్న మృతదేహం మల్యాల మండలం పోతారానికి చెందిన ముత్యల గణేశ్(36)గా గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం గణేశ్‌కు రెవెల్లికి చెందిన బోయ మల్లయ్య కూతురు రజితను ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. భార్య, భర్తలిద్దరూ ముంబైలో ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గణేశ్‌కు చేయికి గాయం కావడంతో, నొప్పి తగ్గాక వస్తానని, రెవెల్లిలోని అత్తగారింటికి సెప్టెంబర్ 2న వచ్చాడు. అత్తారింటి నుంచి వెళ్లిన గణేశ్ కనిపించకుండా పోయినట్లు గణేశ్ కుటుంబ సభ్యులు సెప్టెంబర్ 10న పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే గణేశ్ మృతదేహాన్ని రెవెల్లి గ్రామంలోని మావురం రాంరెడ్డి వ్యవసాయ బావిలో కనుగొన్నట్లు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. తల లేని మొండెంపై ఉన్న గుర్తులు, పసుపు కలర్ షర్ట్, బ్లాక్ కలర్ జీన్స్‌తో పాటు, కుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతదేహం గణేశ్‌దని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తలలేని మొండెంతో ఉండడంతో తల భాగం కుళ్లిపోయి ఊడిపోయిందా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. సంఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, రూరల్ సీఐ ప్రదీప్, ఎస్ఐ ఉపేంద్రచారి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా విచారణ జరిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని సత్తెపీర్ల దర్గా వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(70) మృతి చెందాడు. గుర్తు తెలియ ని ద్విచక్ర వాహనం ఢీకొట్టగా మతిస్థిమితం లేని వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న సదరు వ్యక్తిని వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టింది. దీంతో మతిస్థిమితం లేని వ్యక్తి దూరంగా ఎగిరి పడ్డాడు. చీకట్లో ప్రమాదం జరగడంతో రోడ్డువెంట వెళ్లే వాహనదారులు అతని దగ్గరకు వెళ్లేందుకు సాహసించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రమాకాంత్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని 108వాహనంలో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలం నుంచి వాహనదారుడు పరారీ కాగా, పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు

ఓదెల(పెద్దపల్లి):శానగొండ గ్రామంలో రెవెల్లి కుమారస్వామిపై అదే గ్రామానికి చెందిన ఎర్రవెల్లి ప్రణయ్‌భాస్కర్, ఎర్రవెల్లి ఉదయభాస్కర్, ఎర్రవెల్లి రమాదేవి, ఎర్రవెల్లి సంపత్‌రావు కర్రలు ఇటుకలతో చెట్టుకు కట్టేసి కొట్టి, కులం పేరుతో దూషించారు. ఈమేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామని పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు.

రచయిత గజానన్ కన్నుమూత



థామన్(ఫైల్)

మంథని: తెలుగు, సంస్కృత, మరాఠీతోపాటు ఆంగ్ల భాషల్లో నిష్ణాతులు, ఆచార్యులు, పండితులు, కవి, రచయిత పట్టణానికి చెందిన గజానన్ థామన్(87) మంగళవారం కన్నుమూశారు. మానస సరోవరం, సాకేత రామాయణం ద్వారా తెలుగుసాహితీ ప్రపంచంలో ఆయన బహు ప్రశంసలందుకున్నాయి.మహారాష్ట్ర నాందేడ్‌లో కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత నుంచి ఇక్కడే నివాసముంటున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు.. థామన్ భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

కవి గజానన్ మృతి తీరనిలోటు

కోల్‌సిటీ: ప్రముఖ కవి, రచయిత, రిటైర్డ్ ప్రొఫెసర్ గజానన్ థామన్ మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు అని గోదావరిఖనికి చెందిన స్నేహసాహితీ గ్రంథాలయ నిర్వాహకుడు, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు ఏలేశ్వరం వెంకటేశ్, వేల్పుల నారాయణ, తాళ్లపెల్లి శంకర్, మేజిక్ రాజా, మందల రవీందర్‌రెడ్డి, లెనిన్, రాకుమార ఆవేదన వ్యక్తం చేశారు. గజానన్ మృతికి సంతాపం తెలిపారు. మహారాష్ట్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గజానన్.. పదవీ విరమణ తర్వాత మంథనిలో నివాసం ఉంటూ, మానస సరోవరం లాంటి మంచి కవితా సంపుటాలు వెలువరించారని కొనియాడారు.

రైలుకిందపడి వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: స్థానిక శాంతినగర్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని పేర్కొన్నారు. ఒంటిపై తెలుపు టీషర్ట్, ముదురు బూడిద రంగు లోయర్ ప్యాంటు ఉన్నాయని వివరించారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

గురుకుల విద్యాలయం సందర్శన



విద్యార్థులు, ఉపాధ్యాయులతో నవీన్ నికోలస్

ధర్మారం:మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడారు. పురాతన భవనం, మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్ కూల్చివేయాలని ప్రిన్సిపాల్ గిరిజకు సూచించారు. పాత డైనింగ్ హాల్, కల్వర్టు, విండోమిషన్, డోర్‌లు మరమ్మతు చేయాలని ఆదేశించారు. తప్పనిసరిగా వాలీబాల్, టెన్నిస్ కోర్టు ఏర్పాటుచేయాలన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు వెంటనే ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని సూచించారు. 8, 9వ తరగతి విద్యార్థులకు ఐఐటీ అకాడమిక్ మెటీరియల్ పంపిస్తామని, వాటిపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తోపాటు నీట్, ఐఐటీ మెటీరియల్ పంపిస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ గిరిజ, విద్యా కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం, సభ్యుడు దీకొండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలొచ్చాయి



బతుకమ్మ చీరలతో ఎంపీపీ తదితరులు

పాలకుర్తి: బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అందజేసే చీరలు మంగళవారం గ్రామాలకు చేరుకున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా గ్రామాల డీలర్లకు తహసీల్దార్ జ్యోతి చీరలు అందజేశారు. మండలవ్యాప్తంగా మొత్తం 20 గ్రామాలకు 12,718 చీరలు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి బతుకమ్మ చీరల పంపిణీ

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పంపిణీ చేసేందుకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి మంగళవారం బతుకమ్మ చీరలను తరలించారు. మండలానికి 10,430 బతుకమ్మ చీరలు రాగా గ్రామాల వారీగా పంపిణీ చేయనున్నారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు.

రామగిరి: రాష్ట్ర ప్రభుత్వ బతుకమ్మ కానుకగా అందించే బతుకమ్మచీరలు మంగళవారం మండలానికి రాగా ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఎంపీడీవో ఇనుముల రమేశ్ ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

బొగ్గుబాయి వార్తలు

స్వచ్ఛతలో ఆర్జీ–1ను ముందంజలో ఉంచాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని:స్వచ్ఛతలో ఆర్జీ–1 ఏరియాను ముందంజలో ఉంచాలని జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛత స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్నిప్రభుత్వ రంగ సంస్థల్లో ఈనెల 2నుంచి నెలాఖరు వరకు పనిస్థలాల్లో పరిసరాల పరిశుభ్రత, కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కాలనీలను సుందరీకరణగా తీర్చిదిద్దాలని అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యంతో సింగరేణికి అప్పులు

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని:మితిమీరిన రాజకీయ జోక్యంతో సింగరేణి అప్పుల పాలైందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాజకీయ నాయకుల చేతుల్లో సింగరేణి బందీ అయిందన్నారు. సంస్థను రక్షించుకునేందుకు ఏడోసారి జరిగే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి దాదాపు రూ.29 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. కార్మికుల జీతాలకు యాజమాన్యం అప్పు కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తోందని తెలిపారు. అధికారుల సంఘం కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12, 13, 14 తేదీల్లో సమ్మెకు పిలుపు ఇచ్చాయని తెలిపారు. కోర్టు తీర్పు మేరకు సెప్టెంబర్ 27న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని, దానిప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎల్లాగౌడ్, స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, బోగ సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



03జీడీకే11: మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని:డీపీఈ గైడ్‌లైన్ నిబంధనలు సడలించి, వేతన ఒప్పందాన్ని కొనసాగించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గనులపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కోల్ ఇండియాలో కార్మికులకు వేతనాలను ఆపినందుకు నిరసనగా, డీపీఈ నిబంధనలకు సడలింపు ఇచ్చి 2.5 లక్షల బొగ్గు గని కార్మికులకు వేతన ఒప్పందాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. కోల్ ఇండియా చైర్మన్ మాట మేరకు సమ్మెను 12, 13, 14వ తేదీలకు వాయిదా వేశారని తెలిపారు. ఈనెల 11వ తేదీలోగా సమస్య పరిష్కారం కాకపోతే బొగ్గు గనులపై జరిగే సమ్మెను పూర్తిస్థాయిలో విజయవంతం చేసి కార్మికుల ఐక్యతను చాటాలని కోరారు. నాయకులు రాజమౌళి, ఆసరి మహేశ్, గౌస్, రాజేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెయినర్లు కావాలి

గోదావరిఖని:జ్యూట్‌బ్యాగ్‌ల తయారీలో శిక్షణ ఇచ్చే అభ్యర్థులు కావాలని ఆర్జీ–2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ ఇచ్చేందుకు స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర ప్రభావిత గ్రామాల మహిళలు దరఖాస్తుతోపాటు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, 3పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలు జతచేసి ఆర్జీ–2 జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అందజేయాలని సూచించారు.

‘ఎన్నికలు అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్ర’



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

రామగిరి: సింగరేణి ఎన్నికలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్య తొత్తుగా మారిన గుర్తింపు సంఘం కుట్ర చేస్తున్నాయని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. మంగళవారం ఆర్జీ–3 డివిజన్‌లోని ఓసీపీ–2లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి సంస్థను తాకట్టు పెడుతూ, కార్మికుల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం దెబ్బ తీస్తోందని, దానికి వత్తాసు పలుకుతున్న గుర్తింపు సంఘాన్ని కార్మికులు నిలదీయాలని కోరారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఎంఎస్‌తోనే కార్మికులకు సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రాబోయే ఎన్నికలలో బీఎంఎస్‌కు పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు అర్కాల ప్రసాద్‌గౌడ్, కేంద్ర కమిటీ ట్రెజరర్ పొన్నం వేణుగోపాల్‌రావు, నాయకులు మామిడి స్వామి, విద్యాసాగర్, తిరుపతి, ఎండీ జానీ, సురేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.